క్లుప్తంగా

జెడ్పీ చైర్మన్‌ను పరామర్శించిన కడియం



చిల్పూరు: జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డికి ఇటీవల గాయం కావడంతో హనుమకొండ లోని ఇంటి వద్ద ఉంటుండగా బుధవారం ఎమ్మెల్సీ కడియం శ్రీహరి పరామర్శించారు. ఆయన వెంట చిల్పూరు మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు మామిడాల లింగారెడ్డి, నాయకులు మారేపల్లి శ్యాంకుమార్‌రెడ్డి, సంపత్, భూక్య స్వామి నాయక్, ఇల్లందుల విజయ్, రాజేష్‌నాయక్ తదితరులు ఉన్నారు.

'న్యాయబద్ధంగానే ప్లాట్లు కొనుగోలు చేశాం'



బచ్చన్నపేట: మండల కేంద్రంలోని ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి కాలనీలో 580, 582 సర్వే నంబర్‌లలో ప్లాట్లను పూర్తి ఆధారాలతో న్యాయబద్ధంగానే కొనుగోలు చేశామని పలువురు ప్లాట్ల కొనుగోలు దారులు తెలిపారు. బుధవారం ప్లాట్ల కొనుగోలు దారులు మాట్లాడుతూ ఈ సర్వే నంబర్‌లలో దాదాపు 150 మందిమి ప్లాట్లు కొనుగోలు చేశామని, అలాగే నాలా కన్వర్షన్, గ్రామ పంచాయతీ అనుమతులను కూడా తీసుకున్నామని తెలిపారు. జీపీ ఆధ్వర్యంలో ఈ కాలనీలో తాగునీటి బోరును కూడా వేయడం జరిగిందన్నారు. ఇటీవల కొందరు సంబంధం లేని వ్యక్తులు కోర్టులో ఇంజక్షన్ ఆర్డర్ కేసు వేసి ఈ భూమి వారిదేనని అధికారులను తప్పుదోవ పట్టిస్తూ ప్లాట్ల భూమిని ఖబ్జా చేయాలని చూస్తున్నారని అన్నారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా ఇళ్ల నిర్మాణాలను చేపడతామని తెలిపారు. జిల్లా బుచ్చయ్య, భాస్కర్, పాండు, రమేష్, బిక్షపతి, చక్రపాణి, బుచ్చిరాజు, పరమేశ్వర్, సాయిలు, నవీన్ పలువురు పాల్గొన్నారు.

ఏడుగురి రిమాండ్

బచ్చన్నపేట: మండలంలోని గోపాల్‌నగర్‌లో గుడిసెలు అక్రమంగా వేసిన కేసులో ఏడుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ గోపాల్‌నగర్‌లోని 174 సర్వే నంబర్‌లో ప్రభుత్వ భూమి అంటూ అక్రమంగా గుడిసెలు వేయించిన బెల్లంకొండ వెంకటేష్, మిన్నాలపురం ఎల్లయ్య, పర్వతం యాదగిరి, గంగరబోయిన దుర్గయ్య, పందుల మహేష్, వేముల బలరాం, పత్తి హన్మంతులను అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్ చేసినట్లు ఆయన వెల్లడించారు. అక్రమంగా గుడిసెలు వేసిన వారిపై కూడా చట్టరీత్యా చర్యలు తీసుకోవడంతో పాటు వారిని కూడా రిమాండ్‌కు పంపించనున్నట్లు ఆయన వెల్లడించారు.

విద్యుదాఘాతంతో కాడెద్దు మృతి



రఘునాథపల్లి: విద్యుదాఘాతంతో ఓ కాడెద్దు మృతి చెందిన సంఘటన మండలంలోని కుర్చపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు బత్తుల శ్రీను తన కాడెద్లను వ్యవసాయ క్షేత్రంలో మేపుతున్నాడు. సమీపంలో కిందకు వేలాడు తున్న 25 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కాడెద్దు మేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. ట్రాన్స్‌ఫార్మర్ గద్దె ఎత్తు పెంచాలని పలు మార్లు విద్యుత్ అధికారులను కోరినా పట్టించుకోలేదని స్థానికులు వాపోయారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో రూ.60 వేల విలువైన కాడెద్దు మృతిచెందిందని, ప్రభుత్వం నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని బాధిత రైతు కోరారు.

అంకితభావంతో పనిచేసే వారికి గుర్తింపు

కేయూ క్యాంపస్: నిజాయితీ, నిబద్ధతత, అంకితభావం.. ఉద్యోగి పనితనానికి గీటురాయి వారికే తగిన గుర్తింపు లభిస్తుందని కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్ అన్నారు. కాకతీయ యూనివర్సిటీలో తెలుగు విభాగం ప్రొఫెసర్ పంతంగి వెంకటేశ్వర్లు, కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ మధుకర్, నాన్ టీచింగ్ ఉద్యోగులు యాకయ్య, అయిలయ్య, మజీద్ ఉస్సేన్‌బేగ్, సమ్మయ్య ఉద్యోగ విరమణ పొందారు. కాగా, వారిని పరిపాలన భవనంలోని సెనెట్‌హాల్‌లో వీసీ రమేష్‌తో పాటు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీనివాసరావు బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో కేయూ ఫైనాన్స్ ఆఫీసర్ తోట రాజయ్య, అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్, నవీన్, రాజేశ్వర్, పలు సంఘాల బాధ్యులు ఉన్నారు.

ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ రాష్ట్ర అవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుని ఈనెల 2 నుంచి 21 రోజుల పాటు నిర్వహించనున్న తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేలా అధికారులు, ప్రజాప్రతినిధులు బాధ్యతగా పనిచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. ఆర్డీఓ కృష్ణవేణి అధ్యక్షతన తెలంగాణ దశాబ్ది ఉత్సవాల నిర్వహణ నియోజకవర్గస్థాయి సన్నాహక సమావేశాన్ని డివిజన్ కేంద్రంలోని రైతు వేదిక భవనంలో బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. 21 రోజుల పాటు జరిగే దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేసేలా ప్రభుత్వం నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం వివిధ శాఖల అధికారులు బాధ్యతగా, సమన్వయంతో పనిచేయాలన్నారు. ఉత్సవాలను జయప్రదం చేసేలా వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు చిత్తశుద్ధితో, అంకితభావంతో పనిచేయాలని ఆయన సూచించారు. శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో మండలానికి మూడు రోజుల చొప్పున 21 రోజుల పాటు పల్లెనిద్ర చేయనున్నట్లు తెలిపారు. ఉత్సవాల్లో ఘన్‌పూర్ నియోజకవర్గం జిల్లాలోనే అగ్రగామిగా ఉండేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఘన్‌పూర్ తహసీల్దార్ పూల్‌సింగ్‌చౌహాన్, ట్రాన్స్‌కో డీఈ హుస్సేన్‌నాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుధీర్, ఎంఆర్‌ఐ రవీందర్, ఘన్‌పూర్ మార్కెట్ కార్యదర్శి జీవన్‌కుమార్‌తో పాటు వివిధ మండలాల ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజయ్య



మాట్లాడుతున్న ఎంపీపీ కళింగరాజు

శామీర్‌పేటలో..

జనగామ రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాలు ఘనంగ నిర్వహించాలని ఎంపీపీ మేకళ కళింగరాజు అన్నారు. మండలంలోని శామీర్‌పేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 2 నుంచి 22 వరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నందున ప్రజలు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి స్వామి, ప్రసాద్, వనరాజు పాల్గొన్నారు.

ధరణి సమస్యలపై ప్రభుత్వానికి నివేదిస్తా..



లింగాలఘణపురం: రైతులతో మాట్లాడుతున్న సాదిక్ అలీ

లింగాలఘణపురం/పాలకుర్తి/దేవరుప్పుల: ధరణి పోర్టల్‌తో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వానికి నివేదిస్తామని సాదిక్ అలీ ఫౌండేషన్ చైర్మన్ సాదిక్ అలీ అన్నారు. ధరణి సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా అధ్యయనం చేస్తున్న క్రమంలో బుధవారం లింగాలఘణపురం మండలం కిష్టగూడెం, పాలకుర్తి మండలం మంచుప్పుల, దేవరుప్పుల మండలంలోని కోలుకొండలో సాదిక్ అలీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆయన ధరణి పోర్టల్‌లో చేర్పులు మార్పులపై రైతులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 33 జిల్లాలు పర్యటించి ధరణి వల్ల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై సర్వే చేస్తున్నామని తెలిపారు. రైతులు తమ పేర్లు ఇంకా ధరణిలో రావడం లేదని ఆన్‌లైన్ ద్వారా కాకుండా ప్రత్యక్షంగా కార్యాలయంలో దరఖాస్తు చేసుకునే విధానం కావాలని కోరారు. ధరణి పోర్టల్‌తో పడుతున్న ఇబ్బందులను రైతులు సాదిక్ అలీకి వివరించగా అటు ప్రభుత్వానికి ఇటు హైకోర్టుకు సమస్యలను నివేదిస్తామని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో రాజు, షమీమ్, రైతులు పాల్గొన్నారు.

ముత్తిరెడ్డి మూడోసారి గెలుపొందాలని ప్రార్థనలు



మెదక్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న నాయకులు

జనగామ: జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి మూడో సారి లక్ష ఓట్లతో గెలుపొందాలని కోరుతూ పట్టణ బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం మెదక్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యేకు ప్రజాదరణ ఉందని, ఎమ్మెల్యేగా మూడోసారి విజయం సాధించి మంత్రి పదవి చేపడుతారని పేర్కొన్నారు.

ఆత్మస్థైర్యానికి కరాటే దోహదం



మాట్లాడుతున్న ఎస్సై శంకర్‌నాయక్



కరాటే ప్రదర్శిస్తున్న విద్యార్థులు

జఫర్‌గఢ్: విద్యార్థుల ఆత్మస్థైర్యానికి కరాటే శిక్షణ ఎంతగానో దోహదపడుతుందని ఎస్సై బి శంకర్ నాయక్ అన్నారు. డీవైఎస్‌ఓ జనగామ వారి ఆధ్వర్యంలో మండలంలోని రేగడితండా శివారు టీబీతండా వద్ద ఉన్న మా ఇల్లు అనాథ ఆశ్రమంలో మార్షల్ అర్ట్స్ శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్సై హాజరై మాట్లాడారు. వేసవి సెలవుల్లో విద్యార్థులకు కరాటే శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఆశ్రమ పిల్లలతో పాటు ఇతర విద్యార్థులకు ఉచితంగా కరాటే శిక్షణ ఇవ్వడం సంతోషకరమన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవడంతో పాటు ఇతరులకు నేర్పించాలన్నారు. రుద్రమదేవి, సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాస్టర్ అన్నెపు రాజేంద్రం విద్యార్థులు పాల్గొన్నారు.

దుకాణాలు, గృహాలను అలంకరించండి

జనగామ: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని పట్టణ ప్రజలు, వ్యాపారులు భాగస్వామ్యులు కావాలని మున్సిపల్ కమిషనర్ రజిత బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇళ్లు, దుకాణాలను విద్యుత్ దీపాలతో అలంకరించుకుని, మామిడి తోరణాలు, పుష్పాలంకరణతో పండగ శోభను తీసుకురావాలన్నారు.

మహాసభను విజయవంతం చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

జఫర్‌గఢ్: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఈ నెల 4న నిర్వహించనున్న ఉమ్మడి జిల్లా ఎమ్మార్పీఎస్ మహాసభను విజయవంతం చేయాలని మండల కేంద్రంలో నాయకులు కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్‌లు తాటికాయల హరికృష్ణ, చింత ఎల్లస్వామి మాట్లాడుతూ గత 29 సంవత్సరాలుగా మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో ఎస్సీ వర్గీకరణ సాధన కోసం రాజీలేని పోరాటాలు సాగిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాటికాయల చిన్న ఎల్లయ్య, మంద నరసయ్య, తాటికాయల రమేష్, ఎస్ బాబు, ఎల్మకంటి బాబు, చరణ్, రమేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

వేడుకల్లో రైతులు పాల్గొనాలి



మాట్లాడుతున్న ఏడీ నర్సయ్య

బచ్చన్నపేట: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని రైతు వేదిక భవనాల్లో ఈ నెల 3వ తేదీన నిర్వహించే వేడుకల్లో రైతులు అధిక సంఖ్యలో పాల్గొనేలా చూసి విజయవంతం చేయాలని వెటర్నరీ ఏడీ నర్సయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో అధికారులతో ఆయన సమావేశమయ్యారు. రైతులతో నిర్వహించే వేడుకలను ఘనంగా నిర్వహించాలన్నారు. అలాగే ముందస్తుగా రైతులకు సమాచారం అందించి అధిక సంఖ్యలో హాజరయ్యేలా చూడాలని సూచించారు. ఎంపీడీఓ రఘురామకృష్ణ, ఎంఆర్‌ఐ భగత్‌రెడ్డి, ఏఆర్‌ఐ ఆంధ్రయ్య, రైతు సమన్వయ సమితి గ్రామ కోఆర్డినేటర్ బొమ్మెన ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి అనిల్‌రాజ్, ఏఈఓ రాజ్ కుమార్, రైతులు మేకల భిక్షపతి, రాములు తదితరులు పాల్గొన్నారు.

పాడిరైతుల ధర్నాను జయప్రదం చేయండి

స్టేషన్‌ఘన్‌పూర్: పాడిరైతుల సమస్యల్ని పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 5న హైదరాబాద్ లాలాపేట డెయిరీ ఎదుట నిర్వహించనున్న ధర్నాకు పాడిరైతులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని తెలంగాణ విజయ డెయిరీ పరిరక్షణ సమితి మండల నాయకుడు గాండ్ల రాజు కోరారు. డివిజన్ కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పక్కనే ఉన్న కర్ణాటక రాష్ట్రం నుంచి తెలంగాణ రాష్ట్రానికి పాలు కొనుగోలు చేస్తున్నారని, అక్కడి ప్రభుత్వం రైతులకు లీటర్‌కు రూ.7 ఇన్సెంటివ్‌తో వెంటనే బిల్లును అందిస్తుందన్నారు. పక్క రాష్ట్రంలో పాడి రైతులకు ప్రభుత్వం అన్ని విధాలుగా సౌకర్యాలు కల్పిస్తుంటే తెలంగాణ ప్రభుత్వం పాడిరైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం రైతులకు అందించే నాలుగు రూపాయల ఇన్సెంటివ్ మూడు సంవత్సరాలు గడుస్తున్నా ఇవ్వడం లేదన్నారు. పశువులకు బీమా, గేదెలు, ఆవుల కోసం డీడీలు తీసిన వారికి ఇప్పటికీ పంపిణీ జరుగలేదని, పాడి రైతుల సమస్యల పరిష్కారంలో విజయడెయిరీ విఫలమైందన్నారు. పాడి రైతుల సమస్యల్ని పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 5న ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లో లాలాపేట విజయ డెయిరీ ఎదుట నిర్వహించనున్న ధర్నాకు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

ఆంగ్లభాషపై ఆసక్తి పెంచుకోవాలి



మాట్లాడుతున్న సత్యనారాయణ

జనగామ రూరల్: గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఆంగ్ల భాషపై ఆసక్తిని పెంపొందించుకోవాలని జనగామ మండల నోడల అధికారి సత్యనారాయణ అన్నారు. బుధవారం టీఎస్‌యూటీఎఫ్, పూలే అధ్యయన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏడు రోజుల స్పోకెన్ ఇంగ్లిష్ తరగతుల ముగింపు కార్యక్రమాన్ని మండల అధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యాన పట్టణంలోని బాలికల హైస్కూల్‌లో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ భాష అయిన ఇంగ్లిష్‌లో పట్టు సాధిస్తే ఎక్కడైనా రాణించవచ్చని, ఉన్నత చదువులు చదువుకోవడానికి ఉపయోగపడుతుందని అన్నారు. వేసవి సెలవుల్లో ఇలాంటి శిక్షణ తరగతులు ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, ఆకుల శ్రీనివాస్, కృష్ణమూర్తి, కనకయ్య, త్రివిక్రమ్ మాధవి పాల్గొన్నారు.

మంత్రి చొరవతో మృతదేహం అప్పగింత

బచ్చన్నపేట: మండలంలోని సాల్వాపూర్‌లోని ఓ నిరుపేద కుటుంబానికి చెందిన తన్నీరు ప్రవీణ్ మృతి చెందగా ఆ మృతదేహాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు చొరవతో వారి బంధువులకు అప్పగించినట్లు బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు నాగపురి కిరణ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రవీణ్ గత కొంత కాలంగా బ్రెయిన్‌స్ట్రోక్‌తో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని తెలిపారు. ఈ క్రమంలో చికిత్సకు రూ. 4 లక్షలు కాగా ఆస్పత్రి వర్గాలు డబ్బులు చెల్లిస్తేనే మృతదేహాన్ని అప్పగిస్తామని చెప్పడంతో బాధిత కుటుంబ సభ్యుల వద్ద డబ్బులు లేకపోవడంతో ఈ విషయాన్ని మంత్రి హరీష్‌రావు దృష్టికి తీసుకువెళ్లామన్నారు. వెంటనే స్పందించిన మంత్రి ఆస్పత్రి వర్గాలతో మాట్లాడి మృతదేహాన్ని వారి కుటుంబ సభ్యులకు అప్పగించేలా చొరవ చూపారని అన్నారు. స్పందించిన మంత్రి హరీష్‌రావుకు, మంత్రి దృష్టికి తీసుకెళ్లిన కిరణ్‌కుమార్‌గౌడ్‌కు బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మాజీ సర్పంచ్ బండకింది శింగరయ్య గౌడ్, నాయకులు కొండయ్య, బిక్షపతి, ప్రశాంత్ పాల్గొన్నారు.



మృతదేహాన్ని అప్పగిస్తున్న కిరణ్‌కుమార్‌గౌడ్

నల్లా పైపులకు మరమ్మతులు



కాలనీవాసులతో మాట్లాడుతున్న వెంకట్

బచ్చన్నపేట: మండలంలోని పోచన్నపేట 8వ వార్డులో 'తాగునీటికి తండ్లాట' అనే శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి నల్లాపైపులకు బుధవారం మరమ్మతు చేశారు. నల్లా పైపుల ద్వారా తాగునీరు అరకొరగా వస్తుండడంతో పంచాయతీ కార్యదర్శి వెంకట్ జీపీ సిబ్బందితో కలిసి వెళ్లి మరమ్మతు చేయించారు. దీంతో తాగునీరు పైపుల నిండా వస్తుందని కాలనీవాసులు తెలిపారు.

రెగ్యులరైజ్ చేయాలని వినతి

కేయూ క్యాంపస్: తెలంగాణ రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్ కుక్టా జేఏసీ నాయకుడు డాక్టర్ సాధు రాజేష్, బాధ్యులు కోరారు. ఈమేరకు హనుమకొండలో మంత్రి హరీశ్‌రావుకు బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బాధ్యులు డాక్టర్ సతీష్, డాక్టర్ మామిడాల లింగయ్య, డాక్టర్ చిర్ర రాజు, డాక్టర్ అరూరి సూర్యం పాల్గొన్నారు.

పారదర్శకంగా 'డబుల్' ఇళ్ల ఎంపిక ప్రక్రియ



డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపునకు డ్రా తీస్తున్న అధికారులు

దేవరుప్పుల: రాజకీయాలకతీతంగా పారదర్శకంగా డబుల్‌బెడ్రూం ఇళ్ల ఎంపిక ప్రక్రియ కొనసాగిస్తున్నట్లు ఎంపీపీ బస్వ సావిత్రి మల్లేషం అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సీతారాంపురంలో నిర్మించిన 30 ఇళ్లకుగానూ 26 ఎంపిక కాగా ఏనిమిది మంది స్థల దాతలు పోను మిగిలిన 18 ఇళ్ల లబ్ధిదారులకు తహసీల్దార్ ఎడ్ల రవీందర్‌రెడ్డి పర్యవేక్షణలో డ్రా పద్ధతిన కేటాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి దయాకర్‌రావు సహకారంతో నిర్మించిన ఇళ్లను గ్రామ సభల ద్వారా నిలువ నీడలేని పేదలకు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డిరాజుల రమేష్,మాజీ ఎంపీపీ సోమన్న, మాజీ సర్పంచ్‌లు మల్లేషమ్, వెంకన్న, పల్ల సుందర్‌రామిరెడ్డి. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దయాకర్,ఆర్‌ఐ రాజు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు వేతన సవరణ చేయాలి

హన్మకొండ: విద్యుత్ ఉద్యోగులకు వేతన సవరణ చేయాలని టీఎస్ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ కోరింది. ఈమేరకు హనుమకొండ పర్యటనకు వచ్చిన మంత్రి హరీశ్‌రావుకు ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఈదురు వెంకన్న, వరంగల్ రీజియన్ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ బుధవారం వినతి పత్రం అందించారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలు సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూడాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఆర్టీసీ ఉద్యోగులకు వేతన సవరణ చేయాలని, యూనియన్లను పునరుద్ధరించాలని, సంపూర్ణ ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న 2013 వేతన సవరణ 50శాతం పేస్కేల్ ఏరియర్స్ చెల్లించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రవీందర్, వీసీ.కుమార్, టి.శ్రీనివాస్, కె.ఎల్లయ్య, బి.రఘుపతి, భద్రయ్య పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా డ్రెయినేజీ



రోడ్డుపై నిలిచిన మురుగు నీరు



అస్తవ్యస్తంగా ఉన్న డ్రెయినేజీ

చిల్పూరు: మండలంలోని కృష్ణాజీగూడెం 3వ వార్డులో అస్తవ్యస్తంగా ఉన్న మెయిన్ డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు. అధికారులు, నాయకులు గ్రామానికి వచ్చినపుడు నూతన డ్రెయినేజీని నిర్మించి సమస్య తీరుస్తామని హామీ ఇస్తున్నారే తప్ప అమలుకు నోచుకోవడం లేదన్నారు. ప్రధాన కాల్వ కావడంతో డ్రెయినేజీ నిండి మురుగు నీరంతా దేవాలయం ప్రాంగణంలోకి వస్తోందని, చిన్నవర్షం పడినా బోరులో కలిసి తాగునీరు కలుషితమవుతోందని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

డిజిటల్, సైబర్ నేరాలపై అవగాహన

హన్మకొండ కల్చరల్: వరంగల్ జిల్లా సీనియర్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో నెలవారీ సమావేశంలో భాగంగా డిజిటల్, సైబర్ నేరాలపై హనుమకొండలోని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ భవనంలో బుధవారం అవగాహన సదస్సు జరిగింది. ఫోరం అధ్యక్షుడు డాక్టర్ అనసూరి చంద్రమౌళి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథులుగా టీజీఓఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు, జనరల్ సెక్రటరీ ప్రవీణ్, జాయింట్ సెక్రటరీ రాజేష్ పాల్గొని మాట్లాడారు. ఆస్థాన తెలుగు కవిగా డాక్టర్ పల్లెరు వీరస్వామి, బహుభాషా కవిగా మహ్మద్ సిరాజుద్దీన్, గాయకుడిగా రామమూర్తి, సంగీత విద్యాంసులుగా జగన్నాథచార్యులను ఎన్నుకుని సన్మానించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన హెల్పేజ్ ఇండియా సంస్థ సభ్యుడు శ్యామ్‌కుమార్.. డిజిటల్ సేఫ్టీపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌తో అవగాహన కల్పించారు. అనంతరం డిజిటల్, సైబర్ జాగ్రత్తల పుస్తకాలను అందించారు. హనుమకొండ సుబేదారి పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ షుకుర్, డిజిటల్, సైబర్ నేరాలపై జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో దేవాచారి, శ్రీపాద సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైకి సన్మానం



ఎస్సైని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

జఫర్‌గఢ్: జఫర్‌గఢ్ నూతన ఎస్సైగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన శంకర్ నాయక్‌ను బీజేపీ మండల అధ్యక్షుడు తాటి సురేష్‌గౌడ్ నేతృత్వంలో ఆ పార్టీ నాయకులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్సై శంకర్‌నాయక్‌ను శాలువలతో ఘనంగా సత్కరించారు. నాయకులు బుర్ర తిరుపతిగౌడ్, గడ్డం లింగస్వామి, ఇల్లందుల సారయ్య, మారపల్లి రవి, అబ్బరబోయిన యాకస్వామి పాల్గొన్నారు.